క్లుప్తంగా

చురుగ్గా డ్రైనేజీ పనులు



మునగపాకలో నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ కాలువ

మునగపాక: స్థానిక మెయిన్ రోడ్డు సమీపంలో డ్రైనేజీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.8 లక్షల పంచాయతీ నిధులతో రాధాకృష్ణ ఫంక్షన్ హాలు నుంచి కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి.

కల్యాణ మండపం లీజు రూ.13.21 లక్షలకు ఖరారు



వేలం పాట నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

పాయకరావుపేట: పట్టణంలోని శ్రీరాధా రుక్మిణీ సహిత పాండురంగ దేవస్థానం కల్యాణ మండపం లీజు కోసం గురువారం వేలం నిర్వహించారు. వేలం పాటలో 9 మంది పోటీ పడగా.. వి.సోమేశ్వరరావు అనే వ్యక్తి రూ.13.21 లక్షలకు దక్కించుకున్నారని ఆలయ ఈవో కె.దివ్యతేజ తెలిపారు. గతంలో ఈ మండపం రూ.6.66 లక్షలకు లీజుకు వెళ్లిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ యలమంచిలి ఇన్‌స్పెక్టర్ ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణపై నేడు నిరసన



సియ్యాద్రి బుజ్జి

అచ్యుతాపురం రూరల్ : వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర యువజన విభాగం అధ్యక్షుడు అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదేశాల మేరకు శుక్రవారం నర్సీపట్నంలోని మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు సియ్యాద్రి బుజ్జి తెలిపారు. నర్సీపట్నంలోని కళాశాల భవనాల వద్ద జరిగే ఈ నిరసన కార్యక్రమానికి పార్టీ నాయకులు, విద్యార్థులు, ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

మునగపాకలో వాహన తనిఖీలు

మునగపాక: మునగపాక మెయిన్ రోడ్డులో గురువారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి రికార్డులు లేకుండా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేశారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా వాహన రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అతి వేగం ప్రమాదకరమని, పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్లే ఆటో డ్రైవర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులతో అధికారులు

నర్సీపట్నం: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు 15 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 550 మంది నిరుద్యోగ యువతి యువకులు హాజరయ్యారు. 212 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.బాల తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేసారు. ఈ శిబిరంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బైండోవర్ తరువాత పట్టుబడితే రూ.లక్ష జరిమానా

నాతవరం: తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేశాక మళ్లీ పట్టుబడితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని నాతవరం తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ పలువురు పట్టుబడ్డారు. వారిపై నాతవరం ఎస్‌ఐ కేసు నమోదు చేసి గురువారం తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా వారికి కౌన్సెలింగ్ చేశారు. మళ్లీ అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తుండగా పట్టుబడితే లక్ష రూపాయలు జరిమానాతో పాటు పలు సెక్షన్ల కింద కేసులు పెడతామని హెచ్చరించారు. అవసరమైతే రౌడీషీట్లు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.

రైతులపై యూరియా బాదుడు

- అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులు
- రసీదు అడిగితే స్టాకు లేదని సమాధానం
- మార్కెట్లో యూరియా కొరత ఉందంటూ ప్రచారం
- మొక్కుబడిగా అధికారుల తనిఖీలు



పులపర్తిలో ప్రైవేటు ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు



వరి పంటకు యూరియా జల్లుతున్న రైతు

యలమంచిలి రూరల్: రైతులను యూరియా కొరత వేధిస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు చుక్కలు చూపిస్తున్నారు. అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మార్కెట్లో యూరియా కొరత ఉందన్న ప్రచారంతో రైతులు తమకు అవసరమైన యూరియాను ముందుగానే కొనుగోలు చేసుకుని నిల్వ చేసుకునేందుకు చూస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు బస్తాపై దాదాపు రూ.75 నుంచి రూ.80 వరకు అదనంగా రైతుల నుంచి వసూలు చేస్తూ దందాకు పాల్పడుతున్నారు. మండలంలో పులపర్తిలో ఉన్న ఒక ప్రైవేటు ఎరువుల దుకాణంలో యూరియాను అధిక ధరకు విక్రయించినట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ అధిక ధరకు విక్రయించిన విషయం రైతులకు తెలీకుండా వ్యాపారి వారికి రసీదులు ఇవ్వడం లేదు. కేవలం రైతుల దగ్గర్నుంచి ఆధార్, భూమి పాసు పుస్తకం వివరాలను తీసుకుని ఒక్కో బస్తా రూ.350కు విక్రయిస్తున్నారు. రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల్లో ఒక బస్తా ఎరువు రూ.267కు విక్రయిస్తుండగా.. ప్రైవేటు వ్యాపారులు రైతుల డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని అధిక ధరకు విక్రయిస్తున్నా వ్యవసాయాధికారులు మాత్రం అదేమీ తమకు తెలియనట్టు వ్యవహరిస్తున్నారు.

రసీదులివ్వరు.. ధరల పట్టిక కనిపించదు

లైసెన్సు పొందిన ఎరువుల డీలర్లు నిబంధనలు పాటించకపోయినా సంబంధిత అధికారులు మాత్రం వారిపట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తూ రైతులకు నష్టం కలిగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దుకాణంలో ఏ వస్తువు విక్రయించినా అందుకు తగిన రసీదు రైతులు తీసుకోవాలి. రసీదు తీసుకోకపోతే నాసిరకం విత్తనాలు, పురుగు మందులు వంటివి కొనుగోలు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించి రసీదులు తీసుకునేలా చైతన్యపరచాల్సిన అధికారులు అందుకు భిన్నంగా వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రైవేటు వ్యాపారులు దుకాణాల వద్ద కొనుగోలుదారులకు కనిపించేలా స్టాకు వివరాలు, ధరల పట్టిక, లైసెన్సు వివరాలు ఉంచాలి. కానీ ఈ నిబంధనలన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఇటీవల యలమంచిలిలో విజిలెన్స్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా ప్రైవేటు దుకాణాల్లో తనిఖీలు చేసినా లోపాలు గుర్తించకపోవడంతో ఇవన్నీ మామూలేనని రైతులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు నామమాత్రంగా కొన్ని దుకాణాల్లో తనిఖీలు చేసి చేతులు దులుపుకొంటున్న సందర్భాలు ఉన్నాయి. నిబంధనలు పాటించని ప్రైవేటు డీలర్లపై కఠినంగా వ్యవహరించి, రైతుల దగ్గర్నుంచి అధికంగా వసూలు చేసిన సొమ్ము తిరిగి ఇప్పించాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉంది.

షరతులతో అదనపు భారం

యూరియా కోసం వచ్చే రైతులకు వ్యాపారులు పలు షరతులు విధిస్తున్నారు. ఇతర ఎరువులు కూడా కొనాల్సిందేనని నిబంధన పెడుతున్నారు. డీఏపీతో పాటు నానో యూరియాను తీసుకుంటేనే యూరియా విక్రయిస్తామని చెబుతున్నారు. దీంతో అవసరం లేకున్నా అదనపు భారం మోయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రైతులకు ఇబ్బంది లేకుండా సకాలంలో ఎరువులు, విత్తనాలు సహా అవసరమైన అన్ని సేవలు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందేవని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

3 బస్తాలకు రూ.1050 తీసుకున్నారు..



ఇటీవల పులపర్తిలో ఉన్న ఒక ప్రైవేటు వ్యాపారి వద్ద మూడు బస్తాల యూరియా కొనుగోలు చేశాను. మూడు బస్తాలకు రూ.1050 తీసుకున్నారు. రసీదు ఇవ్వలేదు. ఈ పాస్‌లో నా ఆధార్ వివరాలు నమోదు చేసినప్పుడు ఒక బస్తా ధర రూ.266.50గా కనిపించింది. ఒక్కో బస్తాకు రూ.83.50 వరకు అధికంగా వసూలు చేసినట్టు అర్థమైంది. అధిక ధర గురించి అడిగితే యూరియా లేదని వెనక్కు పంపించేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక అధిక ధర వెచ్చించి మూడు బస్తాలు కొనుగోలు చేశాను. ఇక్కడ కొనుగోలు చేసిన రైతులందరి పరిస్థితి ఇంతే. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాను.

– మొగిలి సాంబ, రైతు, పీఎస్‌ఆర్ పేట, యలమంచిలి మండలం

ఘనంగా గ్రామ దేవతల పండగలు



మునగపాకలో మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఒంపోలులో అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కరణం సూర్య

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం గ్రామదేవతల పండగలు ఘనంగా జరిగాయి. మునగపాక, ఒంపోలు, సిరసపల్లి, గంగాదేవిపేట గ్రామాల్లోని మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఒంపోలులోని మరిడిమాంబ అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తనయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సూర్య దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు బొద్దపు శ్రీరామమూర్తి, బొడ్డేడ లిల్లి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దారుణం



మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు మద్దతుగా నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అచ్యుతాపురం రూరల్ : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దారుణమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు ధ్వజమెత్తారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయొద్దని శాంతియుత నిరసన తెలుపుతున్న నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను పోలీసులు అరెస్ట్ చేసి అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌కు తీసుకొస్తున్నారని తెలుసుకున్న ఆ పార్టీ మండల నాయకులు ఆయనకు మద్దతుగా పెద్ద ఎత్తున స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే గణేష్‌ను ఇక్కడి స్టేషన్‌కి తీసుకురాకపోవడంతో వారు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు రూపుదిద్దుకున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ దిశగా ముందుకు వెళ్లడం సరికాదన్నారు. ఆ జీవోను రద్దు చేసి ప్రభుత్వం ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలలను నిర్వహించాలన్నారు. ప్రైవేటీకరణ చేస్తే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన సంధ్యబుజ్జి, కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, వైస్ ఎంపీపీ వాసుపల్లి పద్మా శ్రీనివాస్, జిల్లా స్పోక్స్ పర్సన్ ఉమ్మిడి జగన్, సర్పంచ్‌లు పంచదార్ల పైడిరాజు, గంగిరెడ్డి లక్ష్మిరాము, పిన్నమరాజు రవీంద్రరాజు, దేశంశెట్టి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: అనకాపల్లి డివిజన్ విద్యుత్ శాఖ పరిధి యలమంచిలి సెక్షన్‌లో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని అనకాపల్లి విద్యుత్ శాఖ ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. యలమంచిలి ఉపకేంద్రం పరిధి యలమంచిలి పట్టణం, కొత్త ఎర్రవరం సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం, కొత్తపాలెం వ్యవసాయ కనెక్షన్లు, పెదపల్లి ఉపకేంద్రం పరిధి కొక్కిరాపల్లి, చిన షేకిళ్లపాలెం, పెద షేకిళ్లపాలెం గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చురుగ్గా ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు

కోటవురట్ల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఏపీటీఎఫ్ ముందుంటుందని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు తెలిపారు. మండలంలో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు సంగీత్‌రాజ్, ప్రధాన కార్యదర్శి లోవరాజుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి సమస్యలపై ఆరా తీశారు. సభ్యత్వాలు నమోదు చేసి ఫెడరేషన్ పటిష్టతకు అందరూ ఐక్యంగా పనిచేయాలని ధర్మారావు పిలుపునిచ్చారు. దీర్ఘకాలికంగా ఉన్న ఎన్నో సమస్యలను పరిష్కరించిన ఘనత ఏపీటీఎఫ్‌కు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాన కార్యదర్శి వేణు, జిల్లా కార్యదర్శి దాసు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కృష్ణప్రసాద్, సీనియర్ నాయకులు నూకరాజు, రాము, వాసు, పార్థసారథి, తరుణ్, జీవన్, గోపి, శ్రీను, అప్పలనాయుడు, సూరిబాబు, రాజేంద్రప్రసాద్, ఎస్.ప్రసాద్, రమణాజీ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో దేవాన్ష్ ప్రతిభ



దేవాన్ష్ నాయుడును అభినందిస్తున్న విద్యా సంస్థల అధినేత నరసింహారావు

పాయకరావుపేట: స్థానిక శ్రీప్రకాష్‌లో 9వ తరగతి చదువుతున్న బండారు దేవాన్ష్ నాయుడు జాతీయ స్థాయి అండర్–17 వ్యక్తిగత యోగా పోటీల్లో సత్తా చాటాడు. ఈ నెల 13 నుంచి 16 వరకు హర్యానా రాష్ట్రం కర్నాల్ పట్టణంలో జరిగిన యోగా పోటీల్లో దేవాన్ష్ రజత పతకం సాధించాడు. ఈ మేరకు ఆయనను గురువారం విద్యా సంస్థల అధినేత నరసింహారావు, సంస్థల సంయుక్త కార్యదర్శి ప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, యోగా గురువు సురేష్, తదితరులు అభినందించారు.

వెంకన్న ఆలయానికి విరాళం



విరాళం అందిస్తున్న సావిత్రి

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో తలపెట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పలువురు దాతలు ఆలయ నిర్మాణంలో భాగస్వాములవుతున్నారు. దీనిలో భాగంగా గురువారం రాత్రి మునగపాకకు చెందిన శరగడం సన్నమ్మ, మహాలక్ష్మి దంపతుల కుమార్తె సావిత్రి రూ.10,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డేడ రామునాయుడు, వెలగా శ్రీనివాసరావు, కోనపల్లి రామ్మోహనరావు, ఆడారి కాశీబాబు, విల్లూరి మోహన్, కేవీఎస్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై సభ్యుల అసంతృప్తి

- చప్పగా సాగిన పాయకరావుపేట మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ లంక సూరిబాబు

పాయకరావుపేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం చప్పగా సాగింది. మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయా శాఖల మండల అధికారులు గైర్హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరైనప్పటికీ పలు శాఖల అధికారులు హాజరుకాలేదు. ఎంపీపీ ఇసరపు పార్వతీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి మండల అధికారులు హాజరుకాకపోవడంపై సమావేశాన్ని వాయిదా వేయాలని ఎంపీడీవో పి.విజయలక్ష్మిని సభ్యులు కోరారు. అందుకు సుముఖత వ్యక్తం చేయకపోవడంతో జెడ్పీటీసీ లంక సూరిబాబు మాట్లాడుతూ సభ నుంచి వాకౌంట్ చేస్తున్నట్టు ప్రకటించారు. జెడ్పీటీసీ లంక సూరిబాబుతో సహా మరి కొందరు సభ్యులు సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఎంపీడీవో సభ్యులకు నచ్చచెప్పి మళ్లీ సభను ప్రారంభించారు. సభకు హాజరుకాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోకు జెడ్పీటీసీ సూచించారు.

- ఈదటం గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా, ప్రజాప్రతినిధులకు చెప్పకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. రైతులకు యూరియా కొరత ఉందని మాసాహెబుపేట ఎంపీటీసీ కొంతం నరేష్ తెలిపారు. రైతులకు క్రాఫ్ ఇన్సూరెన్స్ ప్రభుత్వం ఇంతవరకు చెల్లించలేదని అధికారులను పాల్మన్‌పేట సర్పంచ్ కోడ కోటేశ్వరరావు నిలదీశారు. ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, ముఖ్యంగా పాత్రేరు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కాలేదని ఎంపీటీసీ ఇసరపు సత్యనారాయణ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ప్రశ్నించారు. పాత్రేరు సచివాలయంలో పనులు సక్రమంగా సాగడం లేదని సర్పంచ్ గోసల కృష్ణ తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్‌తో విద్యార్థులకు ఫ్రీ సీట్లు కేటాయించడం లేదని శ్రీరాంపురం సర్పంచ్ తెలిపారు. అనంతరం పలు సమస్యలపై ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మహేశ్వరరావు, వైస్ ఎంపీపీ పల్లేల స్వామి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కండక్టర్‌ను దూషించిన వ్యక్తి అరెస్ట్



నిందితుడు శివను అదుపులోకి తీసుకున్న ఎస్‌ఐ జె.పురుషోత్తం

పాయకరావుపేట: రాజమండ్రి బస్సు డిపో కండక్టర్ గోగాడ రేష్మను ఈ నెల 7న మధ్యాహ్న సమయంలో దూషించిన భూపతి శివ అనే వ్యక్తిని పాయకరావుపేట పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పాయకరావుపేట బస్టాండ్‌లో బస్సులో ఉన్న రేష్మ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించారు. రేష్మా ఫిర్యాదు మేరకు శివను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ జె.పురుషోత్తం తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కొరుప్రోలు విద్యార్థిని



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వైష్ణవితో ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: కొరుప్రోలు ఉన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.వైష్ణవి ప్రతిభ కనబరిచినట్టు పీడీ కె.అమ్మోరయ్య తెలిపారు. ఈ విద్యార్థిని ఈ నెల 22, 23, 24 తేదీల్లో విజయవాడలో జరిగే పోటీల్లో ఆడుతోందన్నారు. ఈ మేరకు ఆమెను గురువారం హెచ్‌ఎం కప్పల ప్రసాద్, ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా నిరసన



బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న గుర్రాజుపేట రైతులు

ఎస్.రాయవరం: మనుషుల ప్రాణాలతో చెలగాటమాడే బల్క్‌డ్రగ్ పార్కును తమ ప్రాంతంలో ఏర్పాటు చేయవద్దని గుర్రాజుపేట గ్రామ రైతులు రెండో రోజు గురువారం గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. బల్క్‌డ్రగ్ వస్తే పచ్చని కొబ్బరి తోటలు, వ్యవసాయ భూములు పాడవడమే కాకుండా, గ్రామస్తులు రోగాల బారిన పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం పరిశ్రమలు తీసుకురావాలి తప్ప, ప్రాణాలు హరించే కంపెనీలు ఎందుకని ప్రశ్నించారు. హోం మంత్రి నియోజకవర్గంలో ఇంత పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్నా పట్టదా అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాముురాజు, మాధవి, లత, సత్యనారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



ఎస్.రాయవరంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మీనాకుమారి



పీఎస్‌ఆర్‌పేట పాఠశాల ఆవరణను శుభ్రపరుస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

యలమంచిలి రూరల్: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా జీవించవచ్చని, విద్యార్థి దశ నుంచే స్వచ్ఛతపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని పీఎస్‌ఆర్‌పేట ఎంపీయూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బీవీ ధనలక్ష్మి విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో గురువారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్త తొలగించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకున్నట్టు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొడ్డేడ సత్యనారాయణ, కర్రి వీరభద్రరావు, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజారోగ్యాలు బాగా ఉంటాయని ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు. ఎస్.రాయవరం సచివాలయం వద్ద గురువారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రతపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, మండల కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, పంచాయితీ కార్యదర్శి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ సిస్టమ్‌తో విద్యుత్ బిల్లు ఆదా

మునగపాక: ప్రతి ఒక్కరూ సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకుని, విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవచ్చునని వెలుగు ఏపీఎం బాలరాజు తెలిపరు. మండలంలోని తోటాడలో గురువారం డ్వాక్రా సంఘాల సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం కింద కిలో వాట్‌కు రూ.30వేల రాయితీ, 2 కిలో వాట్‌కు రూ.60వేల రాయితీ, 3 కిలో వాట్‌కు రూ.78వేల రాయితీ కల్పిస్తున్నామన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ రాజశేఖర్, సీసీ ఎం.శ్రీను, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, పెద్దలు దొడ్డి రమేష్, ఆడారి ప్రసాద్, గంగాబత్తుల కుమార్, బుద్ధ రమేష్, బాపూజీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి



పంట పొలాలను పరిశీలిస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: ఖరీఫ్ వరిలో తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మ సూచించారు. మండలంలోని కొత్తపెంట, బోయిలకింతాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట పొలాలను ఆమె పరిశీలించారు. వరి పంట దుబ్బు చేసే దశలో తెగుళ్లు సోకే ప్రమాదం ఉన్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరి పిలకలకు పాము పొడ(పాచి తెగులు) తెగులు సోకినట్లు గుర్తించామన్నారు. ఈ తెగులు నివారణకు హెక్సాకొనజోల్ రెండు మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పంటకు పిచికారి చేయాలన్నారు. ప్రతి రైతు పంటల నమోదు చేసుకోవాలని కోరారు. బోయిలకింతాడ, కొత్తపెంట సర్పంచ్‌లు బాబూరావు, రొంగలి వెంకటరావు పాల్గొన్నారు.